సాక్షి వరంగల్

శుక్రవారం । 21 ఏప్రిల్ । 2023



ప్రజల్ని చైతన్యపర్చే రచనలు చేయాలి

నేటి కవులు, రచయితలు సమాజాన్ని మెల్కొలిపి చైతన్యపర్చే రచనలు చేయాలని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్ అందెశ్రీ అన్నారు. - 8లో




విద్యుత్ సమస్యల్లేని పల్లెలే లక్ష్యంగా..

విద్యుత్ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ గ్రామాల దత్తత కార్యక్రమాన్ని చేపట్టింది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$40^0 / 26^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

మైనార్టీల అభ్యున్నతికి సీఎం కృషి



నెక్కొండ: సీఎం కేసీఆర్ మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని వరంగల్ జిల్లా కోర్టు పీపీ షేక్ అబ్దుల్ నబి అన్నారు. మండల కేంద్రంలోని ఉస్మానియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రంజాన్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం ముస్లిం పెద్దలు రంజాన్ పర్వదిన విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, వైస్ చైర్మన్ మెండె వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, రామాలయం కమిటీ చైర్మన్ సత్యం, మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ హమీద్, కార్యదర్శి రఫీ, కోశాధికారి యాకుబ్ పాషా, సభ్యులు హైమద్ హుస్సేన్, అమీర్, షంషేర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

కాశోజీ సెంటర్: ఖిలావరంగల్ మండలం కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7, 8 తరగతుల విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలను పై తరగతుల విద్యార్థుల చేత పార్ట్ బి సమాధాన పత్రాలను దిద్దించినట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఓ విజయ్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించగా ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థుల చేత పార్ట్ బి సమాధాన పత్రాలను దిద్దించినట్లు గుర్తించగా జీహెచ్ఎస్ కరీమాబాద్ పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.సుదర్శన్(ఎస్ఏ, బయోసైన్స్), డి.రవి(ఎస్ఏ,ఇంగ్లిష్)లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ వాసంతి వివరించారు.

విశ్వరూపిణి అవార్డు అందుకున్న నిర్మలామేరి



గీసుకొండ: మండల పరిధిలోని మరియపురం గ్రామానికి చెందిన చైల్డ్‌లైన్ కమిటీ సభ్యురాలు గోపు నిర్మలామేరి విశ్వరూపిణి అంతర్జాతీయ ఉత్తమ మహిళా అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ ఆర్గనైజేషన్ వారు ఈ అవార్డును ఆమెకు ప్రకటించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ఆమె వెళ్లలేకపోవడంతో ఆమెకు గురువారం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ అర్బన్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్,గ్రేటర్ వరంగల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరాల్లో బాలబాలికలు పాల్గొనాలని కోరారు. మే ఒకటి నుంచి 31వరకు బల్దియాలోని ఇండోర్ స్టేడియంలో జూడో, బ్యాట్‌మెంటన్, టేబుల్ టెన్నిస్, చెస్, యోగా, క్యారంలలో ఉచితంగా నిర్వహించే క్రీడలకు ఆసక్తి ఉన్న 5నుంచి 14 సంవత్సరాల లోపు బాల బాలికలు రావాలని సూచించారు. ఈ నెల 30 లోగా జీడబ్ల్యూఎంసీ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 9701999668లో సంప్రదించాలని సూచించారు.

నగదు బహుమతి అందజేత

నర్సంపేట రూరల్: మండల పరిధిలోని కమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు శిరీష, సృజనలకు మొదటి బహుమతిగా రూ. 10వేలు, ద్వితీయ బహుమతి గంగోత్రి, శ్రీజలకు రూ. 5వేల చొప్పున దాసరి సాంబరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కుమారులు రాజిరెడ్డి, రజనీకర్ రెడ్డిలు గురువారం అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన అనంతగిరి శ్రీజ పై చదువులకు అవసరమైన పూర్తి ఖర్చులు ట్రస్టు ఆధ్వర్యంలో భరిస్తామని హామీ ఇచ్చారు.

'స్కానింగ్'.. దోపిడీ

కరోనా మొదలవడంతో మళ్లీ రోగుల జేబులకు చిల్లు

- గతంలో లాగానే సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు ఫుల్లు
- కొందరు డాక్టర్లతో లోపాయికారి ఒప్పందంతో బిజినెస్
- అవసరం లేకున్నా పరీక్షలు రాస్తున్న వైనం



సాక్షి, వరంగల్: కరోనా మళ్లీ మెల్లగా పుంజుకుంటుండడంతో గ్రేటర్ వరంగల్‌లోని కొన్ని స్కానింగ్ సెంటర్లు పైసల దందాపై దృష్టి సారించాయి. గత సీజన్లలో కరోనా అడ్డుతో ఇష్టారీతిన స్కానింగ్‌లు చేసి రూ.కోట్ల వ్యాపారం చేసిన కొందరు నిర్వాహకులు.. ఇప్పుడు మళ్లీ అదే బాట పట్టారు. ఇటు హనుమకొండ, అటు వరంగల్ నగరంతో పాటు జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో కుమ్మక్కై.. మీరు రోగులను స్కానింగ్‌కు పంపిస్తే కమీషన్ ఇస్తామని లోలోన అగ్రిమెంట్ చేసుకొని తమ వ్యాపారాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించాయి. ఏమాత్రం దగ్గు వచ్చినా, నరాల సమస్య ఉన్నా, కడుపు నొప్పి, కాలు నొప్పి.. ఇలా ఏ సమస్యతోనైనా వైద్యుడి వద్దకు వెళ్తే ఎంఆర్ఐ స్కానింగ్ తప్పనిసరని ఫలానా స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాలంటూ రెఫర్ చేస్తున్నారు.

ఇలా రోగులకు అవసరమున్నా, లేకున్నా పరీక్షలు రాస్తూ వారి జేబులను ఖాళీ చేస్తున్నారు. ముఖ్య వైద్యుల కనుసన్నల్లోనే ఈ స్కానింగ్ దందా జరుగుతుండడం గమనార్హం. ఈ కేంద్రాల్లో ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షల దందా సైతం సాగుతున్నట్లుగా ప్రచారం ఉంది. గతంలో ఒకటిరెండు కేంద్రాలను వైద్యావిభాగాధికారులు సీజ్ చేసిన సంగతి తెలిసిందే.

రూ.వేలల్లో వసూలు

గ్రేటర్ వరంగల్‌లో దాదాపు 20 వరకు స్కానింగ్ సెంటర్‌లు ఉన్నాయి. ఈ సెంటర్‌కు రిజిస్ట్రేషన్, నిర్వాహకులు రేడియాలజిస్టు కోర్సు చేసి ఉండి, వైద్య సిబ్బంది, స్కానింగ్ యంత్రాల ఏర్పాటుతో నిబంధనల మేరకు కేంద్రాలను నిర్వహించాలన్నది ప్రభుత్వ నిబంధన. అదేవిధంగా కేంద్రాల వద్ద లింగ నిర్ధారణ పరీక్షలు చేయబడవు.. అనే నిబంధనలు ప్రజలకు తెలిసేలా నోటీసు బోర్డులను ఏర్పాటు చేసి నిర్దేశిత ఫీజులు మాత్రమే వసూలు చేయాల్సి ఉంది. అయితే గ్రేటర్ వరంగల్‌లో స్కానింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. 24 గంటల పాటు అందుబాటులో ఉండే ఈ సెంటర్లలో స్కానింగ్ రూ.3,500 నుంచి మొదలుకొని రూ.15వేల వరకు వసూలు చేస్తున్నారు. బడాబడా ఆస్పత్రులు మినహా మిగతా హాస్పిటల్స్ వైద్యులంతా ఈ సెంటర్లకే రెఫర్ చేస్తుండడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. ముఖ్యంగా గర్భిణుల స్కానింగుల్లో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. తొలి, మలి కాన్పుల్లో ఆడపిల్లలు జన్మించి ఉండి మగబిడ్డ కోసం ఆరాటపడే వ్యక్తులను టార్గెట్ చేసుకుని అందినంత దోచుకుంటున్నట్లు వైద్యవర్గాల్లోనే చర్చ జరుగుతోంది. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిసినా.. ఫ్యామిలీ డాక్టర్ లేదా బాగా తెలిసిన వ్యక్తులను రంగంలోకి దింపి నిర్ధారణ పరీక్షలు చేసున్నారనే టాక్ ఉంది. వీటిని జిల్లా వైద్యారోగ్య విభాగ అధికారులు నియంత్రించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఎంజీఎంలో ఎంఆర్ఐ స్కానింగ్ లేక ఇబ్బందులు

ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం)ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల నుంచి ఇక్కడి రోగులు బయటకు వెళ్లి ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలలో సొంత ఖర్చులతో చేయించుకుంటున్నారు. దీంతో పేదల జేబులు ఖాళీ అవుతున్నాయి. ఈ పరీక్షలు సమయానికి చేసుకోలేక ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రోగులు సైతం ఉన్నారు. సాధ్యమైనంత తొందరగా ఎంఆర్ఐ సేవలు రోగులకు అందుబాటులోకి తేవాలని రోగులు కోరుతున్నారు.

నిబంధనల మేరకు నిర్వహించాలి..

అవసరమున్న రోగులకే వైద్యులు స్కానింగ్ పరీక్షలు రాయాలి. స్కానింగ్ సెంటర్లను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలి. రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కేంద్రాల వద్ద అందుబాటులో ఉండే రేడియోలాజిస్టు, ఇతర సిబ్బంది పేర్లు నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలి. నిర్దేశిత ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం. డబ్బుకు ఆశపడి నిర్ధారణ పరీక్షలు చేస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో పాటు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ఈ కేసుల్లో చిక్కుకుంటే శిక్ష తప్పదు. దీనిని దృష్టిలో ఉంచుకుని అందరూ నిబంధనలు పాటించాలి.

– డాక్టర్ వెంకటరమణ,డీఎంహెచ్‌ఓ, వరంగల్

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

- కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఈ నెల 14నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ వారోత్సవాలు గురువారం ముగిశాయి. మట్టెవాడలోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో వరంగల్ డివిజన్ అగ్నిమాపకశాఖ అధికారి మామిడి భగవాన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో చిన్న, పెద్ద బహుళ అంతస్తులు నిర్మాణం చేసేటప్పుడు అగ్నిమాపక ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఎన్‌ఓసీలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు, టౌన్ ప్లానింగ్, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో చిన్న, బహుళ అంతస్తులు, స్కూల్స్, హాస్పిటల్స్, మాల్స్, థియేటర్స్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా యజమానులు ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. చిన్న భవనాల నిర్మాణాల విషయంలో జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో బిల్డింగ్ పర్మిషన్ మంజూరు చేసినప్పుడే ఫైర్ ఎన్‌ఓసీ వస్తుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అయితే 15 మీటర్ల కంటే ఎక్కువ నాన్ రెసిడెన్షియల్ అంతస్తులకు, 18 మీటర్ల కంటే ఎక్కువ ఉన్న రెసిడెన్షియల్ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించి ఫైర్ ఎన్‌ఓసీలను అగ్నిమాపక శాఖ కార్యాలయంలో తీసుకుని అనుమతి పొందాలన్నారు. అగ్నిమాపక శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన వారి సేవలను వాడుకొని అగ్ని ప్రమాదాలను అరికట్టే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకునే టెక్నిక్స్, తోటి వారిని కాపాడే విధానం, చిన్నచిన్న మంటలను ఆర్పడం, వాహనాలతో బాధితులను కాపాడే విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, జీడబ్ల్యూఎంసీ అధికారులు, వివిధ పరిశ్రమలకు చెందిన యజమానులు, అడిషనల్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి, రిటైర్డ్ అధికారులు, వరంగల్, హనుమకొండ ఫైర్‌స్టేషన్ అధికారులు శ్రీనివాసరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఓటర్లను రీ వెరిఫికేషన్ చేయాలి

ఓటర్ జాబితాల నుంచి తొలగించిన వారి ఓట్లను రీ వెరిఫికేషన్ చేయడంలో ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు శ్రద్ధతో పనిచేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటర్ జాబితా నుంచి తొలగించిన వారి ఓట్ల రీవెరిఫికేషన్‌పై ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలతో కలెక్టర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2022 నుంచి 2023 జనవరి 5వ తేది వరకు ఓటర్ డెలిటేషన్, రీ వెరిఫికేషన్, ఫొటో సిమిలర్ ఎంట్రీస్ రీ వెరిఫికేషన్ చేయడంతో పాటు కొత్తగా వచ్చిన క్లెయిమ్స్‌పై తగు చర్యలు చేపట్టాలని సూచించారు. దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట, నెక్కొండ, పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల వారీగా తహసీల్దార్లకు కలెక్టర్ పలు సూచనలు చేస్తూ డెత్ కేసులు షిఫ్టింగ్ కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ వ్యక్తులు ఎవరూ కూడా బీఎల్‌ఓలుగా ఉండకూడదన్నారు. చెక్ లిస్ట్ జనరేషన్, ఫీల్డ్ వెరిఫికేషన్ ఈ నెల 28 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువురిపై అట్రాసిటీ కేసు నమోదు

ఖానాపురం: కులం పేరుతో దూషించిన ఇరువురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బుధరావుపేట గ్రామానికి చెందిన కొమ్ము రాములు, మట్టగజ్జి మోహన్‌లు మంగళవారిపేట సర్పంచ్ లావుడ్యా రమేష్ ఇంటి వద్దకు వెళ్లారు. డబ్బుల విషయంలో మాట్లాడుతూ కులం పేరుతో దూషిస్తూ కుటుంబ సభ్యులను కూడా అసభ్య పదజాలంతో తిట్టారు. అక్కడితో ఆగకుండా తనపై దాడి చేసి గాయపర్చిన రాములు, మోహన్‌లపై చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదు చేయగా ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేలిన వడగండ్ల వాన పంటనష్టం లెక్క



గురిజాలలో పంటనష్టంపై రైతులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య(ఫైల్)



రామవరంలో మొక్కజొన్న చేనులో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

- ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు
- బడ్జెట్ విడుదల కాగానే 48,500 మంది రైతులకు నష్టపరిహారం

పంటల వారీగా నష్టం వివరాలు ఇలా..

పంట పేరు	మొత్తం విస్తీర్ణం ఎకరాల్లో..	నష్టం జరిగిన విస్తీర్ణం(ఎకరాల్లో)
మొక్కజొన్న	88,000	47,000
వరి పొలం	1,10,000	700
మిర్చి పంట	6,000	5,600
ఇతర పంటలు	2,000	800

కాశోజీ సెంటర్: గత నెల మార్చి 18, 19వ తేదీల్లో అకాల వడగండ్ల వానకు రబీ సీజన్‌లో వ్యవసాయ పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో వివిధ రకాల పంటలు 57,855 ఎకరాల విస్తీర్ణంలో నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనావేశారు. సీఎం కేసీఆర్ వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న వ్యవసాయ పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు భరోసా ఇవ్వడానికి మార్చి 24వ తేదీన జిల్లాలో పర్యటించి పంట పొలాలను సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. భరోసాగా ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే. వెంటనే నష్టపరిహారం అందించడానికి దెబ్బతిన్న పంటల వారీగా పూర్తి నివేదిక తయారు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి 48,500 మంది రైతులకు సంబంధించిన వివిధ పంటలు 60, 936 ఎకరాల విస్తీర్ణంలో నష్టం జరిగినట్లు లెక్క తేల్చారు. జిల్లా వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం ఎకరాకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఎకరాకు రూ.10 వేల చొప్పున 48,500 మంది రైతులకు రూ.60.93కోట్ల బడ్జెట్ అవసరం ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయగానే నష్టపోయిన రైతులకు పరిహారం అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు.

ప్రీతి మృతిపై వీడని మిస్టరీ!

రెండు నెలలు కావస్తున్నా అనుమానాస్పద మృతిగానే విచారణ

- ఎలా చనిపోయిందో తెలియక ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- సాంకేతిక పరిశోధనలో తేలని వైనం.. పెండింగ్‌లో పోస్టుమార్టం రిపోర్టు
- నిందితుడు సైఫ్‌కు బెయిలు.. ఖమ్మం జైలునుంచి విడుదల



ప్రీతి (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థిని ధారావత్ ప్రీతి మృతి మిస్టరీగానే మిగిలింది. ఆమెది హత్యనా? ఆత్మహత్యనా? ఇంకా తేలలేదు. ఫిబ్రవరి 22న ఎంజీఎంలో చోటు చేసుకున్న మెడికో ప్రీతి ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సీనియర్ వేధింపుల వల్ల ఆత్మహత్యాయత్నం చేసినట్లు ప్రీతి తండ్రి ధారావత్ నరేందర్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేరోజు రాత్రి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించగా, ఫిబ్రవరి 26న మృతిచెందింది. ఆమె చనిపోయి రెండు నెలలు కావస్తున్నా ఏమీ తేలకపోవడంతో ఇంకా అనుమానాస్పద మృతిగానే పోలీసులు పరిగణిస్తున్నారు. కాగా, నిందితుడు సైఫ్ బెయిల్‌పై గురువారం రాత్రి ఖమ్మం జైలు నుంచి విడుదలయ్యారు.

సాంకేతిక పరిశోధనలో తేలని కారణాలు

ప్రీతి మత్తు ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకుందని భావించినప్పటికీ టాక్సికాలజీ రిపోర్టులో ఎలాంటి మత్తు రసాయనాలు తీసుకున్నట్లు ఆధారాలు లభించలేదు. ఎవరైనా హత్య చేశారా అంటే అందుకు సంబంధించి ఎవిడెన్స్ దొరకలేదు. హత్య కాదు... ఆత్మహత్య చేసుకోలేదు.. మరి ప్రీతి ఎలా చనిపోయిందనేది అందరి మదిని తొలుస్తున్న ప్రశ్న. పోలీసులు సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులు, ర్యాగింగ్ కారణమని నిర్ధారించి అతన్ని అరెస్ట్ చేశారు. కానీ, అనుమానాస్పద మృతిగా భావిస్తూ అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. సాంకేతిక ఆధారాలు సేకరించి దాదాపు రెండు నెలలుగా విచారణ సాగిస్తున్నా ఏమీ తేలలేదు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ సైతం రాకపోవడం, కేసు మిస్టరీ వీడకపోవడంతో తల్లిదండ్రులు మానసిక ఆవేదనతో తల్లడిల్లుతున్నారు. 'సీపీపై తమకు పూర్తిగా నమ్మకం ఉందని, ప్రీతిది హత్యా? ఆత్మహత్యా? తేల్చే విషయంలో తీవ్ర జాప్యం జరగడం.. పోస్టుమార్టం రిపోర్టు రాకపోవడం అనుమానాలు కలిగిస్తుంది' అని ఆమె సోదరుడు పృథ్వీ ఆవేదన వ్యక్తం చేశారు.

విశ్రాంతి గది సీజ్ తొలగింపు..

పోలీసులకు సవాల్‌గా మారిన ఈ కేసులో కీలకంగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలోని అత్యవసర శస్త్రచికిత్స విభాగంలో ప్రీతి పడిపోయిన విశ్రాంతి గది సీజ్‌ను తొలగించారు. ఘటన జరిగిన రోజున మట్టెవాడ పోలీసులు ఈ గదిని సీజ్ చేశారు. పలుమార్లు సీపీ రంగనాథ్ ఆస్పత్రిని, ఆ గదిని సందర్శించి స్వయంగా విచారణ చేశారు. కాగా, మట్టెవాడ పోలీసులు సీజ్ చేసిన గది తాళాలను తొలగించి ఎంజీఎం అధికారులకు అప్పగించారు. ఈ కేసును ఎటు తేల్చకుండానే గది తాళాలను ఎంజీఎం అధికారులకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. కేసు తీవ్రతను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు గిరిజన సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఆ గది సీజ్‌ను తొలగించడానికి కారణం పీజీ వైద్య విద్యార్థులు, సిబ్బందికి అత్యవసర చికిత్స కోసం అవసరం కావడమేనని పోలీసులు చెబుతున్నారు. ప్రీతి తల్లిదండ్రుల అనుమానాలను నివృత్తి చేస్తూ ఏ ఒక్క చిన్న అంశాన్ని వదిలిపెట్టకుండా అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని సీపీ రంగనాథ్ ఇది వరకే తెలిపారు. తప్పు చేసిన వారు తప్పించుకోవడానికి వీలు లేకుండా జాగ్రత్తగా లోతైన విచారణ చేస్తున్నామని ప్రకటించారు. ఒకవేళ గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయినా, సాధారణ మరణమే అయినా అందుకు ర్యాగింగే కారణమని స్పష్టం చేసిన పోలీసులు నిందితులకు శిక్ష ఖాయమని వెల్లడించారు. అయితే ప్రీతిది హత్యా? ఆత్మహత్యా? అన్న మిస్టరీని ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

56రోజుల తరువాత బెయిల్

ప్రీతి మృతికి కారణమైన సీనియర్ వైద్య విద్యార్థి డాక్టర్ ఎంఏ సైఫ్ అలీ అలియాస్ సైఫ్‌ను అరెస్టు చేసి జైల్‌కు పంపించగా, మూడుసార్లు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురయ్యింది. చివరకు 56 రోజుల తర్వాత బెయిల్ మంజూరు కాగా గురువారం రాత్రి ఖమ్మం జైలునుంచి విడుదలయ్యాడు.

ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్ బలోపేతం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



స్థల పరిశీలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

రాయపర్తి: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే దిశలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్ మరింత బలోపేతం కావడం ఖాయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల పరిధిలోని కొత్తూరులో ఈ నెల 23న తలపెట్టిన ఆత్మీయ సమ్మేళన స్థలాన్ని మంత్రి గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునవత్ నర్సింహా నాయక్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ మందటి సుదర్శన్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాజు నాయక్, కొత్తూరు సర్పంచ్ కందికట్ల స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ ఉస్మాన్, ఇన్‌చార్జ్‌లు సంకినేని ఎల్లస్వామి, గారే కిరణ్, మాలోత్ వసుంధర్, హలవత్ సోమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు హామీ

మండల పరిధిలోని తిర్మాలయపల్లిలో వడ్డెర సామాజికవర్గం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి దయాకర్‌రావు హామీ ఇచ్చారు. పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపులో వారు మంత్రిని గురువారం కలిశారు. ఈ మేరకు మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, స్థానిక సర్పంచ్ గజావెల్లి అనంత ప్రసాద్, యాదగిరి, వడ్డెర కులస్తులు గుర్రం అశోక్, రమేష్, కుమార్,చంద్రయ్య, నాగయ్య, ఎల్లయ్య, యాకయ్య పాల్గొన్నారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం

గీసుకొండ: మండల పరిధిలోని వరంగల్–నర్సంపేట రహదారి కోటగండి కోట మైసమ్మ ఆలయం వద్ద కారు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం ఖిల్ నాయక్‌తండాకు చెందిన బాదావత్ భద్రు(32) చెన్నారావుపేట–వరంగల్ మార్గంలో ఆటోను నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మధ్యాహ్నం వరంగల్ వైపు నుంచి నర్సంపేట వైపు వెళ్తూ మార్గమధ్యలో కోటమైసమ్మకు మొక్కి ఆటో ఎక్కి కూర్చున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు రాంగ్‌సైడ్‌లో వచ్చి ఆటోను ఢీ కొట్టింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. గీసుకొండ ఎస్సై వెంకన్న సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని 108 అంబులెన్స్ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి బాదావత్ ఈర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్వోబీ ప్రతిపాదిత స్థల పరిశీలన

- టీ ఆకారంలో నిర్మించాలని కోరిన స్థానికులు
- వరంగల్–నర్సంపేట రోడ్డు వంద ఫీట్లకు కుదించాలని ప్రతిపాదన



ఆర్వోబీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం వద్ద రైల్వే గేటు, వరంగల్–నర్సంపేట రహదారిపై నిర్మించాలని ప్రతిపాదించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) స్థలాన్ని గురువారం ఆర్డీఓ మహేందర్‌జీ, తహసీల్దార్ విశ్వనారాయణ, రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం పరిశీలించారు. స్తంభంపెల్లి వైపు నుంచి రైల్వే గేటు మీదుగా ఆర్‌వోబీని 'టీ' ఆకారంలో నిర్మించి వరంగల్, నర్సంపేట వైపు కిందికి దిగేలా నిర్మించాలని స్థానికులు కోరారు. గేటు పైనుంచి నేరుగా గ్రామంలోకి ఆర్‌వోబీ నిర్మిస్తే చాలా మంది నష్టపోతారని అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే వరంగల్–నర్సంపేట రోడ్డును గ్రామం పరిధిలో వందఫీట్ల వెడల్పుకు మించకుండా విస్తరించాలని 150 ఫీట్లు విస్తరిస్తే చాలా మంది ఇళ్లు కోల్పోయి నష్టపోతారని, బ్రిడ్జికి ఇరువైపులా 20 ఫీట్ల వెడల్పుతో సర్వీస్ రోడ్డు నిర్మించాలని బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ అధికారులను కోరారు. అయితే ప్రజల అభిప్రాయాల మేరకు తీర్మాణం చేసి ప్రతిపాదనలు సమర్పిస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిట్టల రాజు, కొట్టె ముత్తిలింగం, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధరల పెంపు

- నేటి నుంచి అమలు
- ముల్కనూరు డెయిరీ జీఎం భాస్కర్‌రెడ్డి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మహిళా డెయిరీ పాల సేకరణ ధరలు లీటర్‌కు రూ.4 పెంచుతున్నట్లు, ఈ ధరలు శుక్రవారం నుంచి అమలవుతాయని డెయిరీ జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి, మహిళా డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు లీటర్ పాలకు రూ.40.50 ధర ఉండగా.. పెంచిన ధరతో లీటర్‌కు రూ.44.50 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ధరల పెంపుతో 20 వేల మంది మహిళా రైతులకు లబ్ధి చేకూరనుందని వారు వెల్లడించారు. పాల సేకరణ ధరల పెంపుతో ప్రతీనెల రూ.50 లక్షల అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. దాణా, ఇతర ముడి సరుకుల ధరలు పెరగడంతో రైతులపై భారం పడకుండా.. ధరలు పెంచుతున్నట్లు తెలిపారు. 50 కిలోల దాణా బస్తాకు రూ.100 రాయితీ, పశు గ్రాస విత్తనాలకు 50 శాతం రాయితీ. కృత్రిమ గర్భాధారణకు 100 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కాగా.. మిశ్రమ దాణా ప్యాకెట్ ఉచితంగా అందించనున్నట్లు భాస్కర్‌రెడ్డి, ధనశ్రీ తెలిపారు.

పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు

మడికొండ: బుధవారం కూతురును చంపి ఆత్మహత్య చేసుకున్న ఈరబోయిన అనిత(26) కూతురు శివసాన్విత (4) పోస్టుమార్టమ్ అనంతరం గురువారం కాజీపేట మండలం తరాలపల్లిలో పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మడికొండ పోలీసులు ఇన్‌స్పెక్టర్ వేణు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా.. కుటుంబ సభ్యులు అంత్యక్రియలను ముగించారు.


న్యాయవాది హత్య కేసులో ప్రత్యేక పీపీగా సత్యనారాయణ



వరంగల్ లీగల్ : దారుణ హత్యకు గురైన న్యాయవాది మూలగుండ్ల మల్లారెడ్డి కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మోకాళ్ల సత్యనారాయణగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని పందికుంట గ్రామం వద్ద జాతీయ రహదారిపై కిరాయి హంతకులు గతేడాది ఆగస్టు 1న అతికిరాతంగా న్యాయవాది మల్లారెడ్డిని హత్య చేసిన విషయం తెలిసిందే. ములుగు జిల్లా కోర్టులో విచారణకు రానున్న ఈకేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సత్యనారాయణగౌడ్‌ను నియమించింది.

విద్యుత్ సమస్యల్లేని పల్లెలే లక్ష్యంగా..

- గ్రామాల్ని దత్తత తీసుకున్న అధికారులు
- టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో కీలక నిర్ణయం
- ఎన్పీడీసీఎల్ పరిధిలో 622 గ్రామాల దత్తత



హన్మకొండ: విద్యుత్ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ గ్రామాల దత్తత కార్యక్రమాన్ని చేపట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం మొదటిసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా స్థాయి అధికారి నుంచి సెక్షన్ స్థాయి అధికారి వరకు ప్రతీ ఒక్క అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవడం వల్ల గ్రామాల్లో విద్యుత్ సమస్యలనేవే లేకుండా చేయాలని టీఎస్ఎన్పీడీసీఎల్ ఆలోచించింది. ఈవిధానం విజయవంతమైతే ముందు అన్ని గ్రామాల్లో అమలు చేయాలని సంస్థ భావిస్తోంది. ఏళ్లుగా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం జరగడం, సంస్థకు నష్టాలు కలగడం వంటివి తరచూ జరుగుతుండడంతో వాటన్నింటికీ పరిష్కారం దిశగా టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆలోచించి కార్యరూపంలోకి తీసుకొచ్చారు. 32 పట్టణాలు, 5,827 గ్రామాలు, 10.046 శివారు గ్రామాలు, 8,732 దళితవాడలు, 4,506 బలహీనవర్గాల కాలనీల్లో విద్యుదీకరణ చేశారు. సంస్థ పరిధిలోని 16 జిల్లాల్లో 622 గ్రామాలను అధికారులు దత్తత తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో 30 రకాల విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

దత్తత తీసుకున్న గ్రామాల్లో మొదటగా సంస్థకు ఆర్థిక భారం పడని సమస్యలను పరిష్కరిస్తారు. తర్వాత తక్కువ ఖర్చులతో పరిష్కరించే పనులు, ఆతర్వాత ఖర్చుతో కూడుకున్న పనులను పూర్తి చేస్తారు. కాగా.. దత్తత తీసుకున్న గ్రామాల్లో అధికారులు ఇప్పటికే సమస్యలు గుర్తించారు. ఖర్చుతో కూడుకున్న సమస్యలకు సంబంధించిన పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆర్థిక భారం పడని పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

గుర్తించిన సమస్యలివే..

వేలాడుతున్న విద్యుత్ లైన్లు 6,587 గుర్తించి ఇప్పటి వరకు 4,218 సరి చేశారు. వంగిన స్తంభాలు 4,110, పరిష్కారం చూపినవి 2,055. తుప్పు పట్టిన స్తంభాలు 6,075, పరిష్కరించినవి 151, మధ్య స్తంభాలు గుర్తించినవి 17,614, పరిష్కరించినవి 425. రోడ్ క్రాసింగ్ గుర్తించినవి 2,681, పరిష్కరించినవి 117. స్టే వైర్ల సమస్యలు 6,058, పరిష్కరించినవి 298. ఓవర్ లోడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల గుర్తింపు 2,281. ఏర్పాటు చేసినవి 102. ఎత్తు తక్కువగా ఉన్న, శిథిలావస్థకు చేరుకున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు గుర్తించినవి 1130, పరిష్కరించినవి 16. ఏబీ స్విచ్‌ల సమస్యలు 1218, పరిష్కరించినవి 95. ఎర్తింగ్ సమస్యలు 4918, పరిష్కరించినవి 238. వీటితో పాటు రైతులకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం, విద్యుత్ చౌర్యం జరుగుతున్న సర్వీస్‌లు, బిల్ స్టాఫ్, కాలిపోయిన మీటర్ వంటి సమస్యల్ని గుర్తించి వాటిని పరిష్కరించనున్నారు.



భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో లూజ్ లైన్లు బిగిస్తున్న సిబ్బంది

ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

హన్మకొండ: దత్తత గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్, సదర్‌లాల్, రాజుచౌహాన్, మధుసూదన్, భీకంసింగ్, డీఈ (ఐటీ) అనిల్‌కుమార్, ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలు పాల్గొన్నారు.

సమస్యల్లేకుండా తీర్చిదిద్దేందుకు..



విద్యుత్ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా దత్తత గ్రామాల కార్యక్రమం తీసుకున్నాం. ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఎఈలు అన్ని జిల్లాల్లో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఇప్పటికే సమస్యలు గుర్తించారు. పనులు కొనసాగుతున్నాయి. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ నష్టాలు తగ్గించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. మొదటి విడతలో తీసుకున్న దత్తత గ్రామాల్లో వచ్చే ఫలితాలను బట్టి మరింత విస్తృతం చేస్తాం.

- ఎ.గోపాల్‌రావు, ఎన్పీడీసీఎల్ సీఎండీ

వినియోగదారులు సంతోషపడుతున్నారు..



గ్రామాల్లో విద్యుత్ సమస్యల్లేకుండా చేస్తుండడంతో వినియోగదారులు సంతోషపడుతున్నారు. దత్తత గ్రామాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. సమస్యలు పరిష్కరించడం ద్వారా విద్యుత్ అంతరాయాల్లేకుండా నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా వినియోగదారులకు అందుతుంది. గ్రామస్తుల నుంచి సహకారం అందుతోంది. ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్ల గుర్తింపు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మధ్య స్తంభాలు పాతడం, వదులుగా ఉన్న లైన్ల బిగింపు వంటి పనులు చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వెంకటరమణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, హనుమకొండ

రైలులో బాలల అక్రమ రవాణా

- ఏడుగురు ఏజెంట్లు, 11 మంది బాలలను అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

కాశిబుగ్గ: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న 11 మంది బాలలతో పాటు వారిని తీసుకెళ్తున్న ఏడుగురు ఏజెంట్లను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు వరంగల్ ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. ఆర్పీఎఫ్ వారి కథనం ప్రకారం.. భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో కొంత మంది ఒడిశా నుంచి సోలాపూర్‌లో కార్మికులుగా పని చేయించేందుకు బాలలను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో ఆర్పీఎఫ్, సీడబ్ల్యూసీ, జీఆర్పీ సిబ్బంది ముందుగా ఖమ్మం వెళ్లి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన 11 మంది బాలలను, వారిని తరలిస్తున్న ఏడుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని వరంగల్‌లో దిగారు. అనంతరం వారి పూర్తి వివరాలు సేకరించి బాలలను సీడబ్ల్యూసీ హోమ్ తరలించారు. ఏడుగురు ఏజెంట్లు సుశాంత్, బారి సత్తేశ్వర్, రజిత్‌దాస్, సంపూనాయక్, మితుల్‌నాయక్, ఉత్తమ్‌కుమార్, పిట్ట మాధవరావుపై బచపన్ బచావో ఆందోళన్ ప్రాజెక్ట్ అధికారి పోలేపాక నరేశ్ చేసిన ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్

వరంగల్ క్రైం: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ దగ్గర బెట్టింగ్‌కు పాల్పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కాసా లక్ష్మణ్‌రావును అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి రూ.4,11,720 నగదు, రూ.45 వేలు విలువైన ల్యాప్‌టాప్, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు నిస్సార్‌పాషా, లవన్‌కుమార్, శరత్ ఉన్నారు.

పోలీసుల అదుపులో యువకులు?

మహబూబాబాద్ రూరల్: క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్న సుమారు 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని కాపాడేందుకు నాయకులు, నేతలు, అధికారులు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వదిలేసినట్లు పుకార్లు వస్తున్నాయి.

ప్రజల్ని చైతన్యపర్చే రచనలు చేయాలి

- కవితా సంపుటాలను ఆవిష్కరించిన సుద్దాల అశోక్ తేజ, అందెశ్రీ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ

జనగామ రూరల్: నేటి కవులు, రచయితలు సమాజాన్ని మేల్కొలిపి చైతన్యపర్చే రచనలు చేయాలని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్ అందెశ్రీ అన్నారు. గురువారం జనగామలోని విజయ ఫంక్షన్ హాల్‌లో కొక్కొండ జగదీశ్వరి రచించిన 'నల్ల కలువలు', 'జనారణ్యంలో జింకలు' కవిత సంపుటాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల భిక్షపతి, జీవై.కృష్ణ, డాక్టర్ రాజమౌళి, అనిత, గిరి, వివిధ ప్రజాసంఘాల నాయకులు 100 మంది తదితరులు పాల్గొన్నారు.

ఒడవని వేదన



నిరసన జ్వాలలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్, షెహనాజ్‌బేగం

హన్మకొండ కల్చరల్ : ఇంద్రకుమార్ మేఘ్వాల్ హత్య, బిల్కిస్‌బానో, వాకపల్లి ఆదివాసీ మహిళల అత్యాచార బాధితులాంటి వారికి తీరని అన్యాయం జరిగి ఎప్పటికీ ఒడువని వేదన మిగిల్చిందని వరంగల్ జిల్లా ప్రముఖ నవల, కథా రచయిత పి.చంద్ అన్నారు. గురువారం సాయంత్రం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వరంగల్ రచయితల సంఘం 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరసం ప్రచురించిన బిల్కిస్‌బానో, ఇంద్రకుమార్ మేఘ్వాల్‌ల సంఘీభావ రచనలు 'నిరసన జ్వాలలు' పుస్తకావిష్కరణ జరిగింది. వరసం అధ్యక్షుడు నల్లెల్ల రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.చంద్, అనుపమ మాసపత్రిక సంపాదకులు, జమాతే ఇస్లామిక్ హిందూ ఉమెన్స్ వింగ్ షెహనాజ్‌బేగం పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి దండ్రె రాజమౌళి వరసం 16 సంవత్సరాల కృషిని నివేదిక ద్వారా చదివి వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి, బాసిత్, కుమారస్వామి, మెట్టు రవీందర్, వంగాల సంపత్‌రెడ్డి, రమాదేవి, రామ్మూర్తి, శంకర్‌రావు, రాజేశ్వర్‌రావు, సంపత్‌కుమార్, పిట్ట సాంబయ్య, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పుట్టిన రోజు తెల్లారే పరలోకాలకు..

- ఆర్టీసీ బస్సు చక్రాలకింద పడి విద్యార్థి మృతి
- భగ్గుమన్న కుటుంబీకులు, బంధువులు
- బస్సుల అద్దాలు ధ్వంసం..
- మిన్నంటిన రోదనలు



చరణ్(ఫైల్)

వరంగల్ చౌరస్తా: ఇటీవలే పదోతరగతి పరీక్షలు రాశాడు. స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకల్ని ఘనంగా జరుపుకున్నాడు. సమ్మర్ హాలీడేస్ ఎంజాయ్ చేద్దామని ప్రణాళిక వేసుకున్నాడు. కానీ విధి వక్రీకరించింది. పుట్టిన రోజు మర్నాడే ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. గురువారం మధ్యాహ్నం వరంగల్ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు చక్రాల కిందపడి వరంగల్ కాశిబుగ్గ హరిజనవాడకు చెందిన చింత చరణ్ అలియాస్ సన్ని(17) మృతి చెందాడు. చరణ్ కాశిబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదివి.. ఇటీవలే వార్షిక పరీక్షలు రాశాడు. బుధవారం తన పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి ఘనంగా జరుపుకున్నాడు. గురువారం తన స్నేహితున్ని బస్సెక్కించేందుకు మరికొంత మంది స్నేహితులతో కలిసి వరంగల్ బస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఈక్రమంలో బస్టాండ్ నుంచి బయటికి వెళ్లేందుకు చరణ్ ప్రయత్నిస్తుండగా.. ప్లాట్ ఫామ్‌పై నిలిపి ఉన్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 21 జెడ్ 0031) ముందు నుంచి వెళ్తుండగా.. అదే సమయంలో నిజామాబాద్ డిపో-1 చెందిన టీఎస్ 16 యూఏ 6677 బస్సు పార్క్ చేసేందుకు డ్రైవర్ ఎలియాస్ రివర్స్ తీసుకుంటున్నాడు. చరణ్ రెండు బస్సుల మధ్య ఇరుక్కున్నాడు. అతడి మిత్రులు మాత్రం అప్పటికే మొదటి బస్సును దాటేశారు. చివరకు ఉన్న చరణ్ బస్సుల మధ్య ఇరుక్కోగా నిజామాబాద్ డిపోకు చెందిన బస్సు చక్రాల కింద పడి మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న చరణ్ కుటుంబీకులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు తరలివచ్చారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే చరణ్ మృతి చెందాడని ఆగ్రహంతో ఐదు బస్సుల అద్దాలు పగులగొట్టారు. కంట్రోల్ రూమ్‌పై దాడి చేశారు. దీంతో బస్‌స్టేషన్ ఆవరణ ఉద్రిక్తంగా మారింది. ఇంతేజార్‌గంజ్ పోలీసులు రంగంలోకి దిగి.. ఆందోళనకారులను శాంతింపజేశారు. మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేశ్ తెలిపారు. కుమారుడు రక్తపు మడుగులో పడి ఉండడంతో ఆ తల్లిదండ్రులు గుండెలు బాదుకుటూ ఏడ్చిన తీరు అందరినీ కలిచివేసింది. డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ.. బస్సును అజాగ్రత్తగా వెనక్కి తీస్తుండగా ప్రమాదం జరిగిందని.. చరణే ఫోన్ మాట్లాడుతూ.. రెండు బస్సుల మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడని పలు రకాలుగా ప్రయాణికులు చర్చించుకున్నారు. ఇంతేజార్‌గంజ్ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



ఘటనాస్థలిలో చరణ్ మృతదేహం

వడదెబ్బతో కూలీ మృతి



యాకయ్య మృతదేహం

మహబూబాబాద్ రూరల్: వడదెబ్బతో జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రావు కాలనీ చెందిన గాదెల యాకయ్య (42) గురువారం రాత్రి మృతి చెందాడు. యాకయ్య ఉదయం భవన నిర్మాణ పనికి కూలీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక స్నానం చేసేందుకు వెళ్తూ కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు యాకయ్య వడదెబ్బతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

కూతురు చెంతకు తల్లి



దేవమ్మను కూతురికి అప్పగిస్తున్న సఖి సెంటర్ నిర్వాహకులు

వరంగల్: సొంత గ్రామంనుంచి తప్పిపోయి వచ్చిన ఓ తల్లిని వరంగల్ సఖి కేంద్రం నిర్వాహకులు గురువారం ఆమె కూతురు వద్దకు చేర్చారు. నాలుగు నెలలుగా లేదనుకున్న అమ్మ ఇంటికి రావడంతో ఆ కూతురు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సఖి సెంటర్ వారు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుకొండ మండలం దుక్కా తండా గ్రామంలో గుర్తుతెలియని మహిళ నెల రోజులుగా ఉంటున్నదని, గ్రామస్తులు మహిళా హెల్ప్‌లైన్ ద్వారా ఈనెల 13న వరంగల్ సఖీ సెంటర్‌కు సమాచారం ఇచ్చారు. సఖీ సెంటర్ రెస్క్యూ టీం మహిళను ఆధీనంలోకి తీసుకుని ఆశ్రయం కల్పించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇస్తూ వివరాలు సేకరించగా.. తన పేరు భీమడ్ల దేవమ్మ అని, భర్త చనిపోయాడని, ఒక కూతురు ఉందని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నాచుపల్లి గ్రామం అని తెలుసుకున్నారు. వెంటనే ఖమ్మం జిల్లా సఖి సెంటర్ వారితో కో-ఆర్డినేట్ చేసి ఆ మహిళ ఫొటోను, చెప్పిన వివరాలను షేర్ చేశారు. వారు సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ల సహాయంతో దేవమ్మ కూతురు, అల్లుడిని గుర్తించారు. వారికి సమాచారం ఇవ్వగా దేవమ్మ అని నిర్ధారించుకున్నారు. ఈ నెల 19న అల్లుడు, కూతురు వరంగల్‌కు వచ్చి తీసుకెళ్లారని సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లె శ్రీలత, సిబ్బంది నూర్జాహాన్, నిర్మలాదేవిలు తెలిపారు.

మేరు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

నయీంనగర్: తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ మెంబర్, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ తాళ్ల సంపత్‌కుమార్ గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈసందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. బై లా ప్రకారం ఎన్నికలు నిర్వహించడుతాయని, మేరు సంఘం ఎన్నికల్లో పాల్గొనేందుకు మేరు కులస్తులు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు గ్రామాలు, వార్డులు. మే 17 నుంచి జూన్ 16 వరకు పట్టణాలు, మండలాలు. జూన్ 17 నుంచి జూలై 16 వరకు జిల్లాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 18 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తారని, అడ్‌హాక్ కమిటీ సభ్యులు కూడా పోటీ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లాల అడ్‌హాక్ కమిటీ కన్వీనర్లు పెండ్యాల హరిప్రసాద్, కర్నె రవీందర్, గూడూరు బాలాజీ, గట్ల రమేశ్, కోటేశ్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల సేవలందించిన లోకోషెడ్

- రైల్వే జీఎం ఎకె.జైన్
- కాజీపేట డీజిల్ షెడ్ గోల్డెన్ జూబ్లీ, షెడ్ సావనీర్ విడుదల
- ఆకట్టుకున్న కాయిన్, కరెన్సీ ఎగ్జిబిషన్



సావనీర్‌ను విడుదల చేస్తున్న జీఎం తదితరులు



బ్యాటరీ షెడ్‌ను ప్రారంభిస్తున్న జీఎం

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకో షెడ్ జాతికి ఉజ్వల సేవలందించి 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం గర్వించదగ్గ విషయమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. డీజిల్ లోకో మోటివ్స్, ఎలక్ట్రిక్ లోకోస్ మొదలైన కొత్త సాంకేతికతలను ప్రవేశపెట్టడంలో కాజీపేట డీజిల్ షెడ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉందన్నారు. కాజీపేట డీజిల్ కాలనీ రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం రాత్రి జరిగిన డీజిల్ లోకో షెడ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను రైల్వే జీఎం ఎ.కె.జైన్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వేలో కాజీపేట డీజిల్ లోకో షెడ్ 50 వసంతాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. షెడ్ మొదటి బ్యాచ్ అధికారులు, కార్మికులు రైల్వే అభివృద్ధికి, షెడ్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారితో రైల్వేకు లాభం చేకూరిందన్నారు. మొదట 30 లోకోలతో చేపట్టిన నిర్వాహణ ప్రస్తుతం అందరి కృషితో 220 లోకోల నిర్వహణ స్థాయికి ఎదిగిందన్నారు. డీజిల్ లోకో షెడ్‌లో డీజిల్ ఇంజన్ల అవసరం తగ్గుతున్న దృష్ట్యా ఎలక్ట్రిక్ ఇంజన్ల నిర్వహణ చేపడుతున్నట్లు అందుకు తగినవిధంగా రైల్వే కార్మికులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఆర్థిక సంవత్సరానికిగాను రైల్వే విద్యుద్దీకరణ పనులు పూర్తి కానున్నట్లు తెలిపారు. కాజీపేట డీజిల్ లోకో షెడ్ నిర్వహణలో, అభివృద్ధిలో, కార్మికుల పనితనంలో ఎంతో పురోగతి సాధించిందని ఇందుకు జీఎం అభినందిస్తూ రూ.50 వేల నగదు పురస్కారాన్ని ప్రకటించారు. రైల్వే ప్రిన్స్‌పాల్ చీఫ్ ఇంజనీర్ పి.డి.మిశ్రా, డీఆర్ఎం ఎ.కె.గుప్తా మాట్లాడుతూ.. కాజీపేట డీజిల్ లోకో షెడ్‌కు దక్షిణ మధ్య రైల్వేలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా.. అధికారులు, కార్మికులను అభినందించారు. ఈసందర్భంగా షెడ్ సావనీర్ సంచికను విడుదల చేశారు. షెడ్ మొదటి బ్యాచ్ అధికారులను, రిటైర్డ్ అయిన కార్మికులను జీఎం చేత సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

పలు ప్రారంభోత్సవాలు

కాజీపేట డీజిల్ లోకో షెడ్‌లో ఏర్పాటు చేసిన బ్యాటరీ షెడ్, అండర్ ట్రక్ షెడ్, బ్యాలెన్స్ మిషన్‌ను రైల్వే జీఎం ఎ.కె.జైన్ ప్రారంభించారు. అనంతరం సెమినార్ హాల్‌లో రైల్వే అధికారులతో జీఎం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

వావ్ కాయిన్స్..

గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా గుంతకల్ డీజిల్ లోకో షెడ్ రిటైర్డ్ సెక్షన్ ఇంజనీర్, న్యూమిస్మటిక్ సొసైటీ ఆఫ్ రాయలసీమ ఐ.ఎం.ఫెర్నాండెజ్ కరెన్సీ కాయిన్ అండ్ కరెన్సీ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. రైల్వే జీఎం ఫెర్నాండెజ్‌ను అభినందించారు. రాత్రి రైల్వే ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు రైల్వే అధికారులను ఆకట్టుకున్నాయి. డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ సందీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో సికింద్రాబాద్ రైల్వే అధికారులు ధర్మేందర్ కుమార్, తౌర్యా, నాగ్య, రాథోడ్, నవీన్, వెంకటరాజు, ఇతర విభాగాల అధికారులు, కాజీపేట డీజిల్‌షెడ్ అధికారులు హనుమానాయక్, భానుప్రకాశ్, రాజశేఖర్, రవీందర్, సూపర్‌వైజర్లు, రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, ఎస్సీ ఎస్టీ, ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.